క్లుప్తంగా

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసి ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం పలు అభిషేకాలు చేపట్టారు. అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అవరణలో అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ఆలయ ఎదుట ఉన్న త్రిశూలం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ పర్యవేక్షించారు.

సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం



రోటరీ క్లబ్ సభ్యుల సమావేశం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రోటరీ క్లబ్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని క్లబ్ ప్రెసిడెంట్ పెనల జయరాజగోపాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పండ్లూరు వద్ద ఉన్న ఓ హోటల్ వద్ద ఆదివారం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గంతో పాటు సభ్యులతో కలిసి సమావేశం జరిపారు. రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను వివరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బస్సు షెల్టర్ నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. వైస్ ప్రెసిడెంట్ దాసరి ప్రభాకర్ నాయుడు, కార్యదర్శులు రామ్మోహన్, సుబ్రహ్మణ్యం తదితరులను ఘనంగా సత్కారించారు.

అనుమానితుల సమాచారం ఇవ్వాలి



పట్టుబడ్డ మోటార్ సైకిళ్లతో పోలీసులు

గూడూరు రూరల్: పట్టణంలోని స్లమ్ ఏరియాలలో ఎవరైనా అనుమానితులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని గూడూరు డీఎస్పీ రమణ కుమార్ సూచించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు పార్కు ప్రాంతంలోని అరుంధతీ వాడలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఆ ప్రాంతంలో ప్రతి ఇల్లు జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి ధ్రువపత్రాలు లేని పది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఎవరైనా కొత్త వారికి ఆశ్రయం ఇచ్చే సమయంలో అన్నీ పరిశీలించి ఇల్లు అద్దెకు ఇవ్వాలని సూచించారు. ఒకటో పట్టణ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, రూరల్ సీఐ కిశోర్ బాబు, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో దోపిడీ

స్వర్ణముఖి నది నుండి ఇసుక కొల్లగొడుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్వర్ణముఖి నది నుండి ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో అధికారులు కొంత మేరకు చర్యలు చేపట్టారు. అయితే నాన్‌లోకల్ వ్యాపారులు ఇసుక దోపిడీని కొనసాగిస్తున్నారు. దీన్ని అరికట్టడం అధికారులకు సవాల్‌గా మారింది.

- యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్న స్థానికేతరులు
- అధికారులకు సవాల్‌గా మారిన ఇసుక అక్రమ రవాణా



ఇటీవల పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

పెళ్లకూరు: మండలంలోని ముమ్మారెడ్డిగుంట, పుల్లూరు, కలవకూరు కూడలి ప్రాంతమైన స్వర్ణముఖి నదిపై చెక్‌డ్యామ్ వద్ద ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వెంకటగిరి, శ్రీకాళహస్తి, కసపర్తి, దయనేడు, కొణతనేరి ప్రాంతాలకు చెందిన స్థానికేతరులు ఇసుక అక్రమంగా తరలించేస్తున్నారు. స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ రవాణా నివారించేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్థానిక అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అయితే స్వర్ణముఖి నది చెక్‌డ్యామ్‌కు అత్యంత సమీపం నుండి తొట్టంబేడు మండల పరిధి ఉంది. దీంతో స్థానికేతరులైన ఇసుక వ్యాపారులు పెళ్లకూరు మండల పరిధిలో ఇసుక లోడింగ్ చేసుకుని నిమిషాల వ్యవధిలో తొట్టంబేడు మండల పరిధి లోకి వెళుతున్నారు. దీంతో ఇక్కడ పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఇసుక ట్రాక్టర్లును పట్టుకోవడం సవాల్‌గా మారింది. అప్పుడప్పుడు ఇసుక లోడింగ్ చేసే కూలీలు మద్యం మత్తులో అధికారులతో వాగ్వాదానికి దిగుతుండడంతో ఇక్కడ డ్యూటీలు చేసే అధికారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆగని అక్రమ రవాణా

స్వర్ణముఖి నది నుండి అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. పుల్లూరు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట గ్రామాల్లోని ట్రాక్టర్ యజమానులకు, ఇసుక వ్యాపారులకు అధికారులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ట్రాక్టర్లు స్వర్ణముఖి నదిలో దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో తాత్కాలికంగా స్థానికులను నివారించగలిగారు. కానీ స్థానికేతరులను మాత్రం అరికట్టడంలో విఫలమయ్యారు. స్వర్ణముఖి సమీపంలోనే తొట్టంబేడు మండలం సరిహద్దు కావడంతో ఇసుక ట్రాక్టర్లు జోరుగా పరుగులు తీస్తున్నాయి. అంతే కాకుండా స్వర్ణముఖి నదిలో నాణ్యమైన ఇసుక వెంకటగిరి, శ్రీకాళహస్తి పట్టణాల్లో రూ.5వేలు వరకు గిరాకీ ఉండడంతో రోజుకు ఒక్కో ట్రాక్టర్ ఐదు ట్రిప్పులకు పైగా తరలిస్తోంది. ఒక ట్రాక్టర్ యజమాని రోజుకు రూ.25వేలు సంపాదిస్తుండడంతో ఇక్కడ వ్యాపారులు ఇదే అలవాటును కొనసాగిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వెంకటగిరికి తరలి వెళుతున్న ఇసుక ట్రాక్టర్లు

గ్రామాభివృద్ధికి సహకారం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అరుణ

గూడూరు రూరల్: గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని ఎన్ఆర్ఐ డాక్టర్ పల్లిపాటి అరుణ తెలిపారు. రూరల్ పరిధిలోని చెంబడిపాళెం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్, రచ్చబండను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడిన తన భర్త పల్లిపాటి రమణయ్య పుట్టిన చెంబడిపాళెం గ్రామాభివృద్ధికి గతంలో ట్రస్టును ఏర్పాటు చేశామన్నారు. నెల్లూరు, గూడూరు ప్రాంతాలకు చెందిన ప్రముఖ వైద్యులు ఉచితంగా పలు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. వైద్యులు వెంకటేశ్వరప్రసన్న, నారా కీర్తి, డి.మహేంద్రనాథ్‌రెడ్డి, త్రివిక్రమరావు, గ్రామ సర్పంచ్ పల్లిపాటి పెంచలమ్మ, మల్లవరపు నాగభూషణరెడ్డి, వెంకటమ్మ, మస్తానమ్మ, మురళీ, భాస్కర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తీరప్రాంత రోడ్డు గుంతలమయం



వరగలి రోడ్డు మధ్యలో పెద్ద గుంత



వరగలి పంచాయితీ కార్యాలయం వద్ద నీటి మడుగు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని వరగలి గ్రామంలోని రోడ్డు గుంతల మయంగా మారింది. సాగరమాల రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మట్టి, గ్రావెల్ తరలించే టిప్పర్లు నిరంతరం ప్రయాణిస్తుండడంతో ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. దీంతో ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. వరగలి గ్రామంలో రోడ్డు 2 కి.మీ మేర ఉంటుంది. ఈ రోడ్డులో భారీ వాహనాలు రాక పోకలు సాగిస్తుండడంతో చిన్న పాటి గుంతలు ప్రస్తుతం పెద్దవిగా మారాయి. ప్రతి చోట మోకాలు లోతు గుంతలు ఉన్నాయి. ఇకనైనా తీర ప్రాంతంలోని పరిశ్రమల యజమానులు, పోర్టు ప్రతినిధులు తమ సీఎస్ఆర్ నిధుల కింద రోడ్లను బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డీఎస్పీ విచారణ

కోట: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆదివారం గూడూరు డీఎస్పీ రమణకుమార్ పరిశీలించారు. ఇటీవల కోటకు చెందిన సాయి అనే యువకుడిపై నమోదైన ఫోక్సో కేసుపై విచారణ జరిపారు. మైనర్ బాలికను అపహరించిన కేసులో పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



షాహిర్ అహ్మద్

గూడూరు రూరల్: ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ పోటీలలో అండర్-17 బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ఆదివారం పీడీ శివకుమార్ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే ఎస్‌కే షాహిర్ అహ్మద్ శనివారం నెల్లూరులోని జరిగిన బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచారని అన్నారు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం భారతి విద్యార్థి షాహిర్‌అహ్మద్‌ను అభినందించారని తెలిపారు.

కండలేరులో 22.310 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 22.310 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 1150, పిన్నేరు కాలువకు 40, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



పెంచలకోన క్షేత్రం



ఆదిలక్ష్మిదేవి(ఫైల్)

రాపూరు: ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీఆదిలక్ష్మీదేవికి 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 3వ తేదీ సాయంత్రం 6గంటలకు కలశస్థాపన, ఆదిలక్ష్మీదేవికి సౌభాగ్యలక్ష్మీదేవిగా అలంకరణ, 4న ఆదిలక్ష్మిదేవి అలంకరణ, 5న ధాన్యలక్ష్మి అలంకరణ, 6న ధైర్యలక్ష్మి అలంకరణ, 7న గజలక్ష్మి అలంకరణ, 8వ తేదీన సంతానలక్ష్మి అలంకరణ, 9న విద్యాలక్ష్మి అలంకరణ. 10న విజయలక్ష్మీ దేవి అలంకరణ, 11న ధనలక్ష్మి అలంకరణ, 12న విజయదశమి సందర్భంగా శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం, పూలంగిసేవ, ఉదయం 8.30కి శ్రీవారు అశ్వవాహనంపై పారువేట, 9గంటలకు శమీపత్రపూజ, 11గంటలకు కల్యాణం జరుగుతుందని వివరించారు. శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు అమ్మవారికి ఉదయం నవ కలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, క్షేత్రోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

కోడి పందాల స్థావరంపై దాడులు



కోడి పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సూళ్లూరుపేట రూరల్: కుదిరి గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. కోడి పందాలు నిర్వహిస్తున్న ఆరుగురిని పట్టుకుని కేసులు నమోదు చేశామని ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు కోళ్లు, మూడు బైకులు, ఏడు సెల్‌ఫోన్లు, రూ.2,100 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కోడి పందాలు నిర్వహిస్తే కఠినంగా శిక్షలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా వేప చెట్ల నరికివేత



నరికేసిన వేప చెట్టు

చిల్లకూరు: గూడూరు మండలంలోని పోటుపాళెం గ్రామ చెరువు కట్ట, లోపలి భాగంలో ఉన్న పదికి పైగా వేప చెట్లను శనివారం కొంతమంది అక్రమంగా నరికివేసిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. రైతులకు సాగు నీరు అందించే నీటి పారుదల శాఖ ఆధీనంలో ఉన్న చెరువుకట్టతో పాటుగా లోపలి భాగంలో వివిధ రకాల చెట్లు ఉన్నాయి. వీటిలో పదికి పైగా వేప చెట్లు ఉన్నాయి. అయితే వీటిని నరికి, తరలించేశారు. వీటి విలువ సుమారు లక్ష వరకు ఉంటుందని రైతులు అంటున్నారు. చెట్లు నరికి వేసిన విషయాన్ని నీటి పారుదల శాఖ ఏఈ సురేష్ దృష్టికి తీసుకెళ్లగా తనకు విషయం తెలియదని, సోమవారం చెరువు కట్ట వద్దకు వెళ్లి, పరిశీలించి చర్యలు చేపడుతామని అన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మకు పొంగళ్లు



అమ్మవారి గుడి ముందు పొంగళ్లు



కాడి మోస్తున్న గ్రామ పెద్ద కలిచేటి రాధారెడ్డి

సైదాపురం: మండలంలోని దేవరవేమూరు గ్రామ శక్తి అంకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలంతా కలిసి గ్రామశక్తి అంకమ్మ తల్లికి ఊరేగింపుగా కాడి కట్టుకుని భక్తిశ్రద్ధలతో పొలిమేరల్లో ఉన్న అమ్మవారి గుడి వద్దకు మేళతాళాలతో బయల్దేరారు. గ్రామ పెద్దల పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రజలతోపాటు బంధుగణమంతా గ్రామానికి విచ్చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. అనంతరం పొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తుడు కలిచేటి రాధారెడ్డి ప్రత్యేకంగా కాడితో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తోట వెంకటేశ్వర్లు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పెన్న మస్తాన్‌రెడ్డి, తోట విజయ్‌కుమార్, గోపిదేశి శ్రీనివాస్, పార్వతల సుబ్బయ్య, పార్వతల హరిబాబు, సర్పంచ్ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి

నాయుడుపేట టౌన్: దసరా సెలవు రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో తరగతులను నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తడుకు చందు కోరారు. పట్టణంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అక్టోబర్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించిందన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

3 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

నాయుడుపేట టౌన్: బ్రాహ్మణవీధిలో ఉన్న వ్యూహ లక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివార్ల ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలను అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణశర్మ తెలిపారు. ఆదివారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు.